సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025



బాల శాస్త్రవేత్తలకు ప్రోత్సాహం

విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలను వెలికి తీసేందుకు ఇన్‌స్పైర్ మనక్ పేరిట ప్రతిపాదనలు పంపేందుకు ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ వరకూ గడువు పొడిగించింది. -8లో



వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే ఉద్యమిస్తాం

వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే ఉద్యమిస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0/24.2

జిల్లాలో గురువారం 24.2 - 36.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ప్రశాంతంగా స్టాఫ్‌నర్స్ నియామకాల కౌన్సెలింగ్



స్టాఫ్‌నర్స్‌ల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్డీ రామగిడ్డయ్య

కడప రూరల్: కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్‌-4)లో గురువారం నిర్వహించిన కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్స్ నియామకాల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎంపికైన 67 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. స్టాఫ్‌నర్స్‌లుగా పోస్టింగ్‌లు ఇచ్చారు. ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శేఖర్, సూపరింటెండెంట్‌లు శ్రీనివాసులు, వెంకటసుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్స్ బత్తనయ్య, వనీష తదితరులు పాల్గొన్నారు.

1315 టన్నుల యూరియా రాక

కడప అగ్రికల్చర్: వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలకు గురువారం 1315 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తెలిపారు. కడపకు వచ్చిన యూరియా ర్యాక్‌ను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప జిల్లాకు 900 మెట్రిక్ టన్నులు కాగా ఇందులో 395 టన్నులు మార్క్‌ఫెడ్‌కు పంపగా మిగతా 205 టన్నులు మన గ్రోమోర్ సెంటర్‌కు, మరో 300 మెట్రిక్ టన్నులు ప్రైవేటు డీలర్లకు కేటాయించినట్లు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాకు 415 మెట్రిక్ టన్నులు కేటాయించగా ఇందులో 328 మెట్రిక్ టన్నులను మార్క్‌ఫెడ్‌కు, 58 టన్నులు మనగ్రోమోర్ సెంటర్లు, మరో 29 టన్నులు ప్రైవేటు డీలర్లకు కేటాయించినట్లు చెప్పారు.



అందని వేతనం.. గడవని జీవనం

- దుర్భరంగా ఉపాధి కూలీల పరిస్థితి
- మే 31 నుంచి అందని కూలి
- రూ.119 కోట్ల వరకు పెండింగ్
- చెల్లించని మెటీరియల్ బిల్లు రూ.40 కోట్లు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

ఉపాధి హామీ పథకానికి సంబంధించిన వివరాలు



జారీ చేసిన జాబ్ కార్డులు:	నమోదైన కూలీల సంఖ్య:	యాక్టివ్ జాబ్ కార్డుల సంఖ్య :	యాక్టివ్ కూలీల సంఖ్య :
2.31 లక్షలు	4.2 లక్షలు	1.89 లక్షలు	3.2 లక్షలు

2025-26లో చేసిన పని దినాల సంఖ్య: 60.48 లక్షలు

కడప సిటీ: ప్రస్తుతం ఉపాధి హామీ కూలీల వేతనాల వెతలు తారాస్థాయికి చేరాయి. మే 31 నుంచి ఇప్పటి వరకు కూలీలు చేసిన పనులకు వేతనాలు అందకపోవడంతో.. వారి జీవనం ప్రశ్నార్థకంగా మారుతోంది. దీంతో కూలీలు పనులకు రావాలంటే పెద్దగా ఆసక్తి చూపడం లేదు. సాధారణంగా గతంలో ప్రతి వారం వారికి సంబంధించిన వేతనాలు వారి ఖాతాల్లో జమ అయ్యేవి. మూడు నెలలకు పైగా దాదాపు కూలీలకు అందాల్సిన వేతనం రూ.119 కోట్లుగా ఉంది. అలాగే మార్చి నుంచి ఇప్పటి వరకు రావాల్సిన మెటీరియల్ బిల్లులు కూడా దాదాపు రూ.40 కోట్లు పెండింగ్‌లో ఉండడంతో సంబంధిత పనులు చేసిన వ్యక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది. పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఎప్పుడు అందుతాయన్న విషయం కూడా ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ లేదని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం హార్టికల్చర్, హౌసింగ్ పనులు మాత్రమే

ఇంతకు ముందు ప్రతివారం ఉపాధి హామీ కూలీలకు సంబంధించిన బిల్లులు వారి ఖాతాల్లో జమ అవుతూ ఉండేవి. అయితే ఒక్కసారిగా మూడు నెలలకు పైగా వేతనాలు అందకపోవడంతో వారి పరిస్థితి దీనంగా మారింది. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైనప్పటికీ.. కూలీల ఖాతాల్లో జమకాకపోవడం గమనార్హం. వ్యవసాయ పనులు కూడా అంతంత మాత్రమే ఉండటంతో.. అటు వేతనాలు అందక, ఇటు జీవనం సాగక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు కూడా చెప్పుకొనేంత డిమాండ్ లేకపోవడంతో.. వారి ఆర్థిక పరిస్థితి మరింత క్షీణించింది. ఈ నేపథ్యంలో వారి కొనుగోలు శక్తి తగ్గి డబ్బుల కోసం ఇతరులను ఆశ్రయించే పరిస్థితి నెలకొంటోంది. హార్టికల్చర్ తప్ప ప్రస్తుతం మిగతా పనులు కొనసాగడం లేదు. ఎందుకంటే చెరువుల్లో వర్షాల కారణంగా నీళ్లు ఉండటంతో ఈ పనులు జరగడం లేదు. కేవలం హార్టికల్చర్, హౌసింగ్ పనులు మాత్రమే కొనసాగుతుండగా, ప్రస్తుతం కూలీల హాజరు సంఖ్య జూలై నుంచి క్షీణించింది. ఏప్రిల్, మే నెలల్లో 1,10,000 మంది రోజుకు హాజరవుతుండగా, వేతనాలు అందకపోవడంతో క్రమంగా క్షీణించి రోజుకు 700 మంది కూలీలు మాత్రమే హాజరవుతున్నారు.

గణనీయంగా తగ్గిన కూలీల సంఖ్య

ప్రస్తుతం వేతన జీవుల బిల్లులు దాదాపు రూ.119 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటివరకు మూడు నెలలకు పైగా వేతనాలు అందకపోవడంతో పనులకు వచ్చేందుకు ఆసక్తి కనబర్చడం లేదు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీలో కూలీల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఏప్రిల్, మే నెలలతో పోలిస్తే నక్కకు, నాగలోకానికి ఉన్న తేడా కనిపిస్తోంది. జూలై నుంచి రోజురోజుకు క్రమంగా కూలీల సంఖ్య తగ్గి.. ప్రస్తుతం 700 మంది మాత్రమే రోజుకు కూలీలు హాజరవుతున్నారు. హౌసింగ్‌లో 90 రోజుల పనిదినాలు, హార్టికల్చర్‌లో గుంతలు తీసే పనులు మాత్రమే కొనసాగుతున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో ఈ పనులు మాత్రమే జరుగుతున్నాయి. వేతనాలు అందక ఈ పనులకు కూడా కూలీలు వచ్చేందుకు ఆసక్తి చూపకపోవడంతో.. కూలీల సంఖ్య లక్షల నుంచి వందల సంఖ్యకు పడిపోయింది.

» అప్పుల ఊబిలో..

ఉపాధి హామీలో ఒకవైపు కూలీల వేతనాలు సక్రమంగా అందకపోగా, నిర్మాణాత్మక పనులు చేపట్టిన బిల్లులు కూడా పెండింగ్‌లో ఉండటంతో సంబంధిత వ్యక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెటీరియల్ కింద సిమెంటు, బీటీ, మెటల్ రోడ్లు పనులు చేశారు. గత మార్చి నుంచి ఇప్పటి వరకు ఇందుకు సంబంధించిన బిల్లులు అందకపోవడంతో.. అప్పుల ఊబిలో చిక్కుకుని దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మెటీరియల్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు దాదాపు రూ. 40 కోట్లు రావాల్సి ఉంది.

ఇబ్బందులు పడుతున్నాం



ఉపాధి హామీ పనులకు వెళ్లి వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గతంలో వారానికి ఒకసారి బిల్లులు మా ఖాతాల్లో జమ అయ్యేవి. కానీ ప్రస్తుతం బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం వెంటనే బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలి. - సుబ్బరాయుడు, ఉపాధి వేతన జీవి, రాజుపాళెం మండలం

ఆసక్తి లేదు



మేము చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో ఉపాధి హామీ పనులకు వెళ్లాలంటే ఆసక్తిగా లేదు. నెలల తరబడి వేతనాలు పెండింగ్ ఉండడంతో ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నాం. ఒకవైపు వ్యవసాయ పనులు అంతంత మాత్రంగా ఉండగా, దీనికితోడు ఉపాధి హామీ వేతనాలు అందకపోవడంతో జీవనం కష్టతరంగా మారుతోంది. - శాంతమ్మ, ఉపాధి వేతన జీవి, రాజుపాళెం మండలం

త్వరలో బిల్లులు అందే అవకాశం



పెండింగ్‌లో ఉన్న బిల్లులు త్వరలో అందే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి ఎప్పటికప్పుడు డేటాను సిద్ధం చేస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యం 45 లక్షల పనిదినాలు ఉండగా, ఇప్పటికే 57 లక్షల పనిదినాలు నమోదయ్యాయి. అదనంగా 12 లక్షల పని దినాలు చేయడం జరిగింది. - బి.ఆదిశేషారెడ్డి, డ్వామా పీడీ, కడప



రెడ్‌బుక్ రాజ్యాంగంలో పత్రికా స్వేచ్ఛ కూడా లేదు



రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అమలు కావడం లేదు. లోకేష్ రాసిన రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది. ఇందులో పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యానికి కూడా స్థానం లేకుండా పోయింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తే ఎడిటర్లపై కూడా కేసులు పెట్టడం దుర్మార్గం. స్టేట్‌మెంట్ పబ్లిష్ చేస్తే కేసులు పెడతారా? కంటెంట్ మారినా.. ఒక నాయకుడి ప్రెస్ మీట్ కవర్ చేస్తే కేసులు పెట్టడం ఏమిటి? పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్య హక్కు ఈ రాష్ట్రంలో లేవా? ప్రజాస్వామ్య దేశంలో మొదటి సారి ఇలాంటి విచిత్రాలు చూస్తున్నాం. ఎంతో కాలం ఇలాంటి ఆగడాలు సాగవు. దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.
–ఎస్‌బీ అంజద్‌బాషా, మాజీ డిప్యూటీ సీఎం

సమంజసం కాదు



ఒక రాజకీయ నాయకుడు తన అభిప్రాయాన్ని తెలియయజేసినప్పుడు విలువైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం ప్రజల పక్షాన ఉన్న పత్రికల బాధ్యత. అయితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తే పత్రికలపై, ఎడిటర్లపై కేసులు పెట్టడం సమంజసం కాదు .అది పత్రికా స్వేచ్ఛను,వాక్ స్వాతంత్ర్యాన్ని హరించడమే.కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నాం. ఇలాంటి ఆగడాలు ఎంతో కాలం సాగవు. దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. – కొరముట్ల శ్రీనివాసులు, మాజీవిప్, మాజీ ఎమ్మెల్యే, రైల్వేకోడూరు

కొత్త సంస్కృతికి తెర



రాజకీయ నేతలు మాట్లాడిన మాటలను ప్రజల వద్దకు తీసుకెళ్లే మాధ్యమం మీడియా.ఈ క్రమంలో వారికి ఇష్టం లేని మాటలు మాట్లాడారని, ప్రజల గొంతుక అయిన పత్రిక పట్ల, ఎడిటర్ల పట్ల కక్షపూరితంగా వ్యవహరించడం దుర్మార్గం.ఇది మీడియా స్వేచ్ఛను హరించడమే. ప్రజాస్వామ్యానికి ఇది ఏమాత్రం మంచిది కాదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు వస్తే.. వాటిని ఖండించవచ్చు లేదా సంబంధిత అధికారి లేదా పదవిలో ఉన్న నాయకుడు పరువు నష్టం దావా వేసుకునే వీలుంది. అయితే చంద్రబాబు సర్కారు కొత్త సంస్కృతికి తెర తీసింది. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయించడం.. ఎడాపెడా అక్రమ కేసులు నమోదు చేసి కోర్టుల చుట్టూ తిప్పే ప్రక్రియను ఎంచుకుంది.ఆధారాల్లేని కేసులు చట్టప్రకారమే కాదు.. ప్రజల ముందు కూడా నిలబడవు.
–గడికోట శ్రీకాంత్ రెడ్డి, మాజీ చీఫ్ విప్

రాత్రి అక్రమంగా యూరియా తరలింపు



రాత్రి వేళ ఆటోల్లో తరలిస్తున్న యూరియా

- అడ్డుకున్న రైతులు
- దురుసుగా ప్రవర్తించిన 'ఫర్టిలైజర్స్' సిబ్బంది

దువ్వూరు: మండలంలో రాత్రిళ్లు అక్రమంగా యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోంది. నిజమైన రైతులకు యూరియా అందక ఎండకు క్యూలో నిలుచొని అష్టకష్టాలు పడుతుంటే.. ప్రైవేట్ వ్యాపారులు మాత్రం రూ.400 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. ఎవరు ఎక్కువ ధర ఇస్తే వారికి ఏ సమయంలోనైనా యూరియా దొరుకుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఏఎస్పీ గత నెలలో దువ్వూరులోని ఫర్టిలైజర్స్ దుకాణాలపై దాడులు చేసి హెచ్చరించినా.. వ్యాపారుల తీరు మారలేదు. దువ్వూరుకు చెందిన మహానందీశ్వర ట్రేడర్స్ గురువారం రాత్రి 9 గంటల సమయంలో మూడు ఆటోల్లో యూరియాను అక్రమంగా తరలిస్తుండగా.. సమీపంలో ఉన్న దళితవాడ రైతులు యూరియా మాకు ఇమ్మంటే లేదన్నారు, ఈ సమయంలో ఎక్కడికి తరలిస్తున్నారని అడ్డుకున్నారు. 'మా ఇష్టం మేము ఏ సమయంలోనైనా అమ్ముకుంటాం, మీరెవరు అడ్డుకునేది' అంటూ షాపు సిబ్బంది దురుసుగా ప్రవర్తించారు.

నిజమైన రైతులకు అందడం లేదని ఆవేదన

మరో పక్క వ్యవసాయాధికారులు దువ్వూరు మండలానికి 980 టన్నుల యూరియా ఇంత వరకు వచ్చిందని చెబుతున్నారు. ఆ యూరియాలో ఎంత శాతం రైతులకు అందిందో, పక్కకు ఎంత తరలిపోయిందో అధికారులే లెక్క తేల్చాలి. ఇంత స్థాయిలో యూరియా పంపిణీ చేసినా రైతులకు అందకుండా ఇలా రాత్రిళ్లు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుంటే... నిజమైన రైతులకు యూరియా ఎక్కడ అందుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియాను సక్రమంగా పంపిణీ చేయని అధికారులు.. అవసరం లేకున్నా యూరియా వాడుతున్నారని, రైతులపైనే నిందలు మోపుతున్నారు. దువ్వూరు మండలంలో 13,500 ఎకరాల్లో పంటలను సాగు చేయగా, అందులో దాదాపు 60 శాతంపైన కేసీ కెనాల్ పరిధిలో రైతులు వరి సాగు చేశారు. ఒక ఎకరాకు ఎంత తక్కువ అన్నా మూడు బస్తాల యూరియా పడుతుందని, కానీ ఒక బస్తా కూడా దొరకడం కష్టంగా ఉందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ అధికారులు ఇప్పటికైనా యూరియా పక్కకు తరలిపోకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

విచారణ చేస్తాం

ఈ విషయంపై మండల వ్యవసాయాధికారి అమరనాథ్‌రెడ్డిని వివరణ కోరగా దువ్వూరు మండలానికి 52 టన్నుల యూరియా మంజూరైందన్నారు. ఆ యూరియాను శుక్రవారం రైతు సేవా కేంద్రాల ద్వారా, ప్రైవేట్ దుకాణాల ద్వారా పంపిణీ చేయనున్నామన్నారు. అయితే దువ్వూరులోని మహానందీశ్వర ట్రేడర్స్ వారు రాత్రి 9 గంటల సమయంలో ఆటోలో యూరియాను తరలించడం తప్పని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

● ఉచిత బస్ ఎఫెక్ట్

పట్టాలు తప్పిన రైల్వే ఆదాయం

- ఖాళీగా మహిళా బోగీలు
- ప్రతి స్టేషన్‌లో పడిపోయిన రాబడి
- బోసిపోతున్న ప్యాసింజర్ రైళ్లు
- రైల్వే అధికారుల్లో ఆందోళన



హుబ్లీ నుంచి తిరుపతికి వెళ్లే ఇంటర్‌సిటీ ప్యాసింజర్‌లో ఖాళీగా దర్శనమిస్తున్న సీట్లు



ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా సమాచారం

మార్గం: ముంబయి-చెన్నై
రైళ్లు : 30 (అప్ అండ్ డౌన్)
స్టేషన్లు: 25
కిలోమీటర్లు: 180

రాజంపేట: కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్త్రీలకు ఉచిత బస్సు పథకం.. రైల్వే ఆదాయానికి గండికొండుతోంది. నిత్యం రద్దీగా ఉండే ప్యాసింజర్ రైళ్లు.. ఇప్పుడు వెలవెలబోతున్నాయి. మహిళా ప్రయాణికుల రాకపోకలు గణనీయంగా తగ్గాయి. దీంతో మహిళా బోగీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే రైళ్లలో కేంద్ర ప్రభుత్వం రాయితీలు తొలగిస్తూ వస్తున్న క్రమంలో.. ఈ పథకం రైల్వే ఆదాయానికి మరో దెబ్బ కొట్టింది. ఇప్పుడు ప్రత్యామ్నాయంగా కేంద్రం ఏ దిశగా అడుగులు వేస్తోందో.. వేచి చూడాల్సిందే.

- ఉభయ జిల్లాల మీదుగా మార్గంలో 25 స్టేషన్లు ఉండగా, డైలీ 30 (అప్ అండ్ డౌన్) రైళ్లు నడుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత బస్సు పథకంతో రైల్వేలకు వస్తున్న ఆదాయం పట్టాలు తప్పుతోంది. ఇప్పటి నుంచే అధికారుల్లో ఎర్నింగ్స్(ఆదాయం)పై ఆందోళన రోజురోజుకు హెచ్చరిల్లుతోంది. ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలోని రైలు మార్గంలో నడిచే నంద్యాల-రేణిగుంట డెమో ప్యాసింజర్, అరకోణం నుంచి కడప వరకు నడిచే అరక్కోణం, తిరుపతి నుంచి హుబ్లీ మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లపై ఉచిత బస్ (స్త్రీశక్తి పథకం) ప్రభావం పడింది. ఫలితంగా రైల్వే ఆదాయనికి ఉచిత బస్ (ఆర్టీసీ) గండికొట్టిందనే రైల్వే నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు మోదీ సర్కారు రాయితీలను రానురాను తీసేసుకుంటూ వస్తోంది. జర్నలిస్టుల పాస్‌ల తోపాటు అన్ని రకాల రాయితీలకు మంగళం పాడిన సంగతి విదితమే. రైల్వేకమర్షియల్ విభాగాన్ని.. ఇప్పుడు ఉచితబస్‌తో ఎరినింగ్స్ కోల్పోతున్న అంశం వేధిస్తోంది.

రైలు ప్రయాణానికి మహిళలు దూరం

ఏ రైలులో అయినా గార్డుబ్రేక్ ముందు ఉండే లేడీస్ కోచ్‌లో సీట్ల కోసం మహిళలు పోటీపడే పరిస్థితులు నిత్యం కొనసాగుతుండటం విదితమే. ప్రతి స్టేషన్‌లో అధికంగా మహిళలు ఈ కోచ్‌లో సీటు కోసం పోటీ పడుతుంటారు. ఇప్పుడు ఆ పరిస్థితులు కనిపించడం లేదు. లేడీస్‌కోచ్‌లో కనీసం పదిమంది కూడా లేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీన్ని బట్టి చూస్తే మహిళా ప్రయాణికులు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణంపై ఆసక్తి చూపుతుండటమే.. ఇందుకు కారణమని రైల్వే వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. పైగా రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితమే అన్న భావనలో రైలు ప్రయాణాలకు స్వస్తి చెపుతుండటం గమనార్హం.

చాలా బోగీల్లో ఖాళీగా సీట్లు

ముంబయి-చెన్నై రైలు మార్గంలోని ఉమ్మడి కడప జిల్లా మీదుగా నడిచే ప్యాసింజర్ రైళ్లు బోసిపోతున్నాయి. ప్రయాణపు ధర తక్కువ అయిన క్రమంలో మహిళా ప్రయాణికులతో రద్దీగా ఉండేవి. ఇప్పుడు ఆ దృశ్యాలు రైలు బోగీలు దూరమయ్యాయి. చాలా మటుకు సీట్లు ఖాళీగా కనిపిస్తున్నాయి.

▸▸ ప్యాసింజర్ రైళ్లపై తీవ్ర ప్రభావం

ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా రైలు మార్గంలో ప్రతి రైల్వేస్టేషన్‌లో ఎర్నింగ్స్ పడిపోతున్నాయి. ప్రధానంగా ప్యాసింజర్ రైళ్ల ప్రయాణంలో ఈ పరిస్థితి చోటుచేసుకుంది. పేదోడి రైళ్లుగా నడుస్తున్న వీటిలో.. తక్కువ వ్యయంతో గమ్యాలకు చేరుకోవచ్చన్న భావనలో మహిళలు ప్రయాణాలు సాగించేవారు. ఇప్పుడు ఆర్టీసీ ఉచిత బస్సుతో రైలు ప్రయాణాలపై ఆసక్తి చూపడం లేదు. కడప నుంచి ఒంటిమిట్ట, నందలూరు, తిరుపతి, కాణిపాకం, తిరుచానూరు, శ్రీకాళహస్తి లాంటి పుణ్యక్షేత్రాలకు నంద్యాలడెమో, ఇంటర్‌సిటీ, అరకోణం రైళ్లను మహిళలు ఆశ్రయించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. నంద్యాల నుంచి కడప, తిరుపతి కానీ ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం చేస్తున్నారు. ఫలితంగా ఈ మూడు రైళ్లు ఆగే స్టేషన్‌లలో ఎర్నింగ్ పడిపోతున్నాయి.

అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా నిశాంత్ కుమార్

రాయచోటి: అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్‌గా నిశాంత్ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.. స్థానికంగా పనిచేస్తున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. గత ఏడాది జూలై 7వ తేదీన శ్రీధర్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

క్రిటికల్ కేర్ యూనిట్‌కు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు

రాయచోటి టౌన్: రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నూతనంగా క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, రవాణా క్రీడలు, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్‌ను నిర్మించనున్నారు. అనంతరం రెండు నూతన అంబులెన్స్‌లను కూడా ప్రారంభించారు. కార్యక్రమంలో రాయచోటి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మోస్తరు వర్షం

- నాలుగు మండలాలు మినహా జిల్లా అంతటా వాన
- కడపలో అత్యధికంగా 66.2 మి.మీ వర్షపాతం

కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు మండలాలు మినహా మిగతా 32 మండలాల్లో వాన పడింది. ఇందులో భాగంగా కడపలో అత్యధికంగా 66.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షం ఆరుతడి పంటలకు ఎంతో ఉపయుక్తం అని అన్నదాతలు తెలిపారు. పంటలకు ఉన్న చీడపీడలు తగ్గే అవకాశం ఉన్నట్లు వారు పేర్కొంటున్నారు.

మండలం కురిసిన వర్షం(మి.మీ)

మండలం	వర్షం	మండలం	వర్షం
కడప	66.2	గోపవరం	20.2
ముద్దనూరు	63.4	తొండూరు	18.4
కొండాపురం	58.6	పులివెందుల	18
మైలవరం	58.6	వేంపల్లి	18
దువ్వూరు	56.2	మైదుకూరు	17.4
రాజుపాళెం	51.2	చక్రాయపేట	16.8
ఎర్రగుంట్ల	46	వల్లూరు	15.4
ఒంటిమిట్ట	43.2	వీఎన్‌పల్లి	14.6
జమ్మలమడుగు	40.2	సిద్దవటం	12.4
లింగాల	40.2	ఖాజీపేట	12.2
సీకే దిన్నె	39.2	చెన్నూరు	10.4
ప్రొద్దుటూరు	36.8	వేముల	10
సింహాద్రిపురం	32.4	బి.మఠం	8.2
బద్వేలు	25.4	చాపాడు	7.4
పెండ్లిమర్రి	23.2	కమలాపురం	6.4

క్లుప్తంగా

బోల్తా పడిన క్రేన్



వరి పంట పొలాల్లో పడిన క్రేన్

చాపాడు : మండలంలోని సిద్ధారెడ్డిపల్లె వద్ద గురువారం ఓ క్రేన్ వరి పొలాల్లో బోల్తా పడింది. బెంగళూరు– విజయవాడ నేషనల్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనుల్లో భాగంగా క్రేన్ వెళుతుండగా వర్షానికి రోడ్డు దెబ్బతినడంతో ప్రమాదవశాత్తూ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. బోల్తా పడిన క్రేన్‌ను మరో రెండు క్రేన్ల సహాయంతో బయటకి తీశారు.

కళా ఉత్సవ పోటీల్లో ప్రతిభ





నజియా తలసుమ్ మహమ్మద్‌సల్మాన్

కడప ఎడ్యుకేషన్ : అన్నమయ్య జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో గురువారం నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీల్లో కడప ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. గాత్రం సోలో పోటీలలో నజియా తలసుమ్, వాయిద్య పోటీలలో మహమ్మద్ సల్మాన్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఇరువురూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడంతో డీఈఓ సుబ్రహ్మణ్యం అభినందించారు. గైడ్ టీచర్ వేపరాల ఎమినేజర్, హెడ్ టీచర్ రమణ పాల్గొన్నారు.

అరుణ ప్రైవేట్ హాస్పిటల్ సీజ్



అరుణ ప్రైవేట్ ఆసుపత్రిని సీజ్ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ, తదితరులు

వేంపల్లె : వేంపల్లె జెడ్పీ బాలురోన్నత పాఠశాల ఎదురుగా ఉన్న అరుణ ప్రైవేట్ హాస్పిటల్‌ను వైద్యాధికారులు గురువారం సీజ్ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాజా మొయిద్దీన్, సిబ్బంది ఆకస్మికంగా అరుణ ప్రైవేట్ హాస్పిటల్ తనిఖీ చేశారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా సర్జరీలు జరుపుతున్న విషయం బయటపడింది. దీంతో ఆసుపత్రిని సీజ్ చేసి నిర్వాహకులకు సూచనలు చేశారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా అరుణ హాస్పిటల్ ఏర్పాటుచేయడమేగాక, సర్జరీలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. హాస్పిటల్ రన్ కావాలంటే ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. సీజ్ చేసిన హాస్పిటల్‌లో మళ్లీ వైద్య పరీక్షలు, సర్జరీలు చేస్తే పోలీసు సహకారంతో చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ నరేష్ ఉన్నారు.

వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే ఉద్యమిస్తాం

- ప్రజల ఆస్తులను పప్పులు, బెల్లాలకు అమ్మేస్తారా...?
- పులివెందుల్లో మెడికల్ కాలేజీ ఉండరాదనే కక్ష?
- మంజూరైన సీట్లను వెనక్కి ఇవ్వడం దుర్మార్గం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే ప్రజా ఉద్యమం తప్పదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అవినీతి విలయతాండవం చేస్తోందన్నారు. చంద్రబాబు అవినీతి చక్రవర్తి అని తెహల్కా డాట్‌కామ్ ఎప్పుడో చెప్పిందని, దేశంలో ఆయనంత సంపన్నుడు ఎవరూ లేరని, ఆయనకున్న ఆస్తులు మరెవరికీ లేవని ఆరోపించారు. పెద్ద హాస్పిటల్స్ అన్నీ హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లో ఉన్నా.. ఏపీలో కరోనాను వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధిగమించారన్నారు. తద్వారా రాష్ట్రంలో తక్కువ మరణాలు నమోదయ్యాయన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితి రాకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఒక విజన్‌తో ఒక్కో జిల్లాకు ఒక వైద్య కళాశాల చొప్పున 17 కొత్త మెడికల్ కాలేజీలను మంజూరుచేయించారన్నారు. 1923 నుంచి రాష్ట్రంలో 12 మెడికల్ కాలేజీలే ఉన్నాయని, కొత్తగా మంజూరైన మెడికల్ కాలేజీల్లో ఐదు కాలేజీలు పూర్తయ్యాయని, మరో రెండు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. పులివెందుల మెడికల్ కాలేజీలో అన్ని వసతులు, వైద్య పరికరాలు ఉన్నా.. పులివెందులకు 50 సీట్లు వద్దు అని లేఖ రాసిన దుర్మార్గ ప్రభుత్వం ఇదేనని ధ్వజమెత్తారు. ఎవరైనా మెడికల్ సీట్లు కావాలని కోరుకుంటారని, సీట్లు వద్దని చెప్పిన ఏకైక ప్రభుత్వాన్ని ఇప్పుడే చూస్తున్నామన్నారు. పులివెందుల ప్రజలు మనకు ఓట్లేయరు...అక్కడ మెడికల్ కాలేజీలు ఉండకూడదనే కక్షతోనే ఇలా చేస్తున్నారని మండిపడ్డారు. 2024–25 సంవత్సరానికి 50 సీట్లు తీసుకొని ఉంటే, 2025–26 సంవత్సరానికి మరో 150 సీట్లు వచ్చి ఉండేవన్నారు. ఆ అవకాశాన్ని ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. వైఎస్ జగన్ మొదటి విడత చేపట్టిన 10 మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తూ జీవో ఇవ్వడం దుర్మార్గమన్నారు. ఒక్కో మెడికల్ కాలేజీ 50–100 ఎకరాల్లో రూ.500 కోట్లతో నిర్మించారని, అవి లక్షల కోట్ల రూపాయల విలువజేసే ప్రజా ఆస్తులని తెలిపారు. ఈ మెడికల్ కాలేజీల వల్ల 2360 మెడికల్ సీట్లు వస్తాయని, 2550 సీట్లు అదనంగా వచ్చే అవకాశముందన్నారు. ఇక్కడ మెడికల్ సీట్లు లేక రాష్ట్రంలోని విద్యార్థులు రష్యా, చైనా, జార్జియా వంటి దేశాలకు పోతుంటే వచ్చిన వాటిని వెనక్కి ఇవ్వడం దారుణమన్నారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు పరం చేయడమే చంద్రబాబు నైజమని, 2014–19లో కూడా ఆయన అనేక ప్రభుత్వ హాస్పిటళ్లను ప్రైవేటుపరం చేశారన్నారు. చిత్తూరు మెడికల్ కాలేజీని అపోలోకు అప్పగించారని గుర్తుచేశారు. ప్రభుత్వ ఆస్తులను పప్పులు, బెల్లాలకు అమ్మేయాలనుకోవడం సరికాదన్నారు. తాను, తన బినామీలను బాగుపరచాలనే ఉద్దేశ్యంతోనే ఇలా చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తే ప్రైవేటీకరణను రద్దు చేస్తామని, బాబు పాలనలో ప్రభుత్వ రంగంలోని ఎన్నో పరిశ్రమలు మూతపడ్డాయని గుర్తు చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం చేస్తుంటే చూస్తూ ఊరుకున్నారని విమర్శించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. సూపర్ ఫ్లాప్ సినిమాకు విజయోత్సవాలు చేసినట్లు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ సూపర్‌హిట్ అంటూ సభలు నిర్వహిస్తోందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్, ఎస్. వెంకటేశ్వర్లు, యానాదయ్య, షేక్ షఫీ, శ్రీరంజన్‌రెడ్డి, వి. నాగేంద్రారెడ్డి, కంచుపాటి బాబు, సాయి, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

బాల శాస్త్రవేత్తలకు ప్రోత్సాహం

ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్లకు గడువు పొడగింపు



ప్రాజెక్టులతో విద్యార్థులు(ఫైల్)

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలను వెలికితీసేందుకు ఇన్‌స్పైర్ మనక్ పేరిట ప్రతిపాదనలు పంపేందుకు ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ వరకూ గడువు పొడిగించింది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఏటా నిర్వహించే ఈ పోటీలలో అన్ని ప్రభుత్వ అనుబంధ పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు తమ ఉపాధ్యాయులతో కలిసి పాల్గొనే అవకాశం ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా 226 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి 1000 ప్రాజెక్టులు పంపాలని ప్రభుత్వం టార్గెట్ పెట్టింది. ఇప్పటి వరకూ 632 ప్రాజెక్టులు మాత్రమే వచ్చాయి. మరో మూడు రోజులు గడువు ఉండడంతో మరిన్ని ప్రాజెక్టులు పంపేందుకు మరో అవకాశం ఉంది.

దరఖాస్తు చేయడం ఎలా..

పాఠశాల స్థాయిలో తొలుత ఐడియా కాంపిటీషన్ నిర్వహించి స్థానిక సమస్యలను పరిష్కరించే దిశగా ప్రాజెక్టులు పంపేలా చూడాలి. ఉత్తమ ఆలోచనను ఎంపిక చేసి ఆ విద్యార్థి పేరు, తండ్రిపేరు తరగతి వివరాలు, విద్యార్థి బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు సంఖ్యలు నమోదుచేయాలి. అనంతరం ఠీఠీఠీ.జీ౩ట ఇజీట్చ్బ్రీటఛీట.జౌఠి.జీ ౩ వెబ్‌సైట్‌లో విద్యార్థులు తమ ఆలోచనలకు అనుగుణంగా ప్రాజెక్టుల వివరాలను నమోదుచేయాలి. రెండు నెలల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ ఆలోచనలను ఎంపిక చేస్తారు. అనంతరం రాష్ట్ర స్థాయికి ప్రాజెక్టు పంపేందుకు విద్యార్థి బ్యాంకు ఖాతాకు రూ.10 వేల నగదు జమ చేస్తారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన వారికి రూ.25 వేల వరకు అదనపు నిధులు కేటాయిస్తారు. పూర్తి స్థాయిలో ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో ప్రతిభ చూపితే రాష్ట్రపతి భవన్ సందర్శనకు అవకాశం ఉంటుంది. అంతేగాక జాతీయ స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టుకు పేటెంట్ లభించే అవకాశం లభిస్తుంది.

ప్రతిభకు పట్టం



ఇన్‌స్పైర్ మనక్‌కు నామినేషన్ల స్వీకరణకు ప్రభుత్వం ఈ నెల 15వతేదీ వరకూ గడువు విధించింది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను పరిశోధనల వైపు ప్రేరేపించడానికి ఇన్‌స్పైర్ మనక్ పథకం ఉపయోగపడుతుంది. గైడ్ టీచర్లు శిక్షణ ఇచ్చి సందేహాలను నివృత్తి చేయాలి. మంచి ప్రాజెక్టులను ఇన్‌స్పైర్ ప్రదర్శనకు తీసుకువచ్చి మంచిపేరు తేవాలి.

– షేక్ షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖ అధికారి

ఉద్యోగులకు పాత పెన్షన్ పునరుద్ధరించాలి

జిల్లా కన్వీనర్ గుజ్జల తిరుపాల్



నల్లబాడ్జీలతో నిరసన తెలుపుతున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం పాత పెన్షన్ పునరుద్ధరించాలని డీఎస్సీ 2003 ఉపాధ్యాయ పోరం జిల్లా కన్వీనర్ గుజ్జల తిరుపాల్, శోభారాణి డిమాండ్ చేశారు. కడప తాలూకా కేంద్రం వద్ద నల్లబాడ్జీలు ధరించి గురువారం మహా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుజ్జల తిరుపాల్, శోభారాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మెమో 57 అనుసరించి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు (7361 మంది), పోలీసులు (1821), గ్రూప్ 1, గ్రూప్2 ఉద్యోగులకు(1800) పాత పెన్షన్ అమలుచేయాలని డిమాండ్ చేశారు. 2004 సెప్టెంబర్, 01 తదుపరి నియామకం జరిగి సీపీఎస్ విధానంలో కొనసాగుతున్న సుమారు 11000 మందికి పాత పెన్షన్ పునరుద్ధరించాలన్నారు. ఎస్‌జీటీ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో పాత పెన్షన్ అమలుకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ఏపీ ప్రభుత్వంలోని ముగ్గురు ఐఏఎస్ అధికారులకు గత ప్రభుత్వం పాత పెన్షన్ పునరుద్ధరించిందన్నారు. ఈ కార్యక్రమంలో బి.గంగాధర్, ఎస్.బాబూరెడ్డి, పి.వెంకటసుబ్బారెడ్డి, చెన్నయ్య, రోజారాణి, చంద్రకళ, కె.చెన్నయ్య, లక్ష్మీరాజా, మోపూరి వెంకట శివారెడ్డి, సుబ్బారెడ్డి, రామాంజనేయులు, రామిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ప్రతాపుడు, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

బెదిరింపులతో డబ్బు లాక్కున్న ముగ్గురు అరెస్టు

కడప అర్బన్ : కడప రిమ్స్ పీఎస్ పరిధిలోని తిలక్ నగర్ ఆంజనేయస్వామి గుడి సమీపంలో వెళ్తున్న వారిని బెదిరిస్తూ పర్సు లాక్కుని పరారవుతున్న చాంద్‌బాషా, మురాఫత్ అలియాస్ లడ్డు, గౌస్ పీర్లను గురువారం అరెస్ట్ చేసినట్లు కడప రిమ్స్ పోలీసులు తెలిపారు. గత నెల 22వ తేదీ రాత్రి తిలక్ నగర్ సమీపంలో ఆంజనేయస్వామి గుడి వద్ద వాకింగ్ చేస్తున్న ఇందుమతి, ఇంకా ఇద్దరు మహిళలు, అటువైపుగా వెళ్తున్న యువకులను బెదిరించి నిందితులు డబ్బు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధిత మహిళ ఇందుమతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రిమ్స్ వైద్య విద్యార్థిని ప్రతిభ



గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకుంటున్న కిరణ్మయి

కడప అర్బన్ : కడప రిమ్స్ వైద్య విద్యార్థిని కల్లూరి కిరణ్మయ ప్రతిభ కనబరచి బంగారు పతకం అందుకున్నారు. వైఎస్సార్ జిల్లా వేంపల్లి మండలం రామిరెడ్డిపల్లెకు చెందిన కల్లూరి శివప్రసాద్‌రెడ్డి (లేట్), ఎద్దుల రత్నమ్మల కుమార్తె కల్లూరి కిరణ్మయి కడప రిమ్స్‌లో వైద్య విద్య అభ్యసిస్తోంది. అనాటమీ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి భళా అనిపించింది. చిన్నపుడే తండ్రిని కోల్పోయిన కిరణ్మయి తల్లి రత్నమ్మ, మేనమామ, అత్త ప్రోత్సాహంతో ఎంబీబీఎస్ సీటు సాధించి కడప రిమ్స్‌లో చేరారు. అనాటమీ విభాగంలో మొదటి సంవత్సరంలో ప్రతిభ చూపి బంగారు పతకానికి ఎంపికయ్యారు. ఈ నెల 9న విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ సమక్షంలో వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్, ముఖ్య అతిథి డాక్టర్ ఓ.పి.యాదవ్ చేతుల మీదుగా బంగారుపతకం అందుకున్నారు. కిరణ్మయి మాట్లాడుతూ భవిష్యత్తులో పీజీ వైద్యను డీవీఎల్ విభాగంలో అభ్యసించాలని, ప్రజలకు తమవంతుగా వైద్య సేవలదించాలని కోరుకుంటున్నానని తెలిపారు.

ఏసీఏ సౌత్‌జోన్ అండర్–23 మల్టీ డే మ్యాచ్‌లు



నయీముల్లా (107 పరుగులు)



రోషన్‌పవన్‌కుమార్ (226 పరుగులు)



సూతేజ్‌రెడ్డి (89 పరుగులు)

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఏసీఏ సౌత్‌జోన్ అండర్–23 మల్టీ డే మ్యాచ్‌లు గురువారం ప్రారంభం అయ్యాయి. స్థానిక కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు–అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుని 57 ఓవర్లకు మూడు వికెట్లు కోల్పోయి 222 పరుగులు చేసింది. ఆ జట్టులోని నయిముల్లా చక్కగా బ్యాటింగ్ చేసి 107 పరుగులు, సాయి గణేష్ 57 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని షేక్ కమిల్ రెండు వికెట్లు తీశాడు. అనంతరం వర్షం కారణంగా మ్యాచ్ నిలిపివేశారు.

వైఎస్సార్ క్రికెట్ స్టేడియంలో..

వైఎస్సార్‌ఆర్ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు–చిత్తూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 75 ఓవర్లకు మూడు వికెట్లు కోల్పోయి 407 పరుగులు చేసింది. ఆ జట్టులోని రోషన్ పవన్ కుమార్ 213 బంతుల్లో 19 ఫోర్లు, 11 సిక్సర్లతో అద్భుతంగా బ్యాటింగ్ చేసి 226 పరుగులు చేశాడు. సోహర్ వర్మ 53 పరుగులు, సూతేజ్ రెడ్డి 89 పరుగులు చేశారు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

ఉల్లి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : మార్క్ ఫెడ్ ద్వారా ప్రారంభమైన మైదుకూరు, కమలాపురం ఉల్లి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఉద్యాన, మార్క్ ఫెడ్ అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్వింటా ఉల్లి ధర రూ.1200 ప్రకారం ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతుల నుంచి మార్క్ ఫెడ్ కొనుగోలు చేస్తుందన్నారు. మైదుకూరు, కమలాపురం మార్కెట్ యార్డుల ఆవరణలో ఇప్పటికే కొనుగోళ్లు ప్రారంభమయ్యాయన్నారు. ఉల్లి రైతులకు నష్టం వాటిల్లకుండా, నాణ్యత పరిగణలోకి తీసుకుని కొనుగోలు ప్రక్రియ చేపట్టినట్లు జేసీ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు, మార్క్‌ఫెడ్ అధికారి పరిమళ జ్యోతి, మార్కెటింగ్ ఏడీ ఆజాద్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన ఎస్‌జీఎఫ్ క్రీడలు



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో క్రీడలు ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగాయి. నగరంలోని డాక్టర్ వైఎస్ ఆర్ క్రీడా పాఠశాలలో జిల్లా స్థాయి అండర్– 14, 17 రాష్ట్రస్థాయి పోటీలకు బాల బాలికల ఎంపిక నిర్వహించారు. ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, సైక్లింగ్ విభాగాలలో పోటీలను ప్రత్యేకాధికారి జగన్నాథరెడ్డి ప్రారంభించారు. ఉమ్మడి కడప జిల్లా నుంచి 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, చంద్రావతి, ప్రవీణ్ కిరణ్, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

రామాపురం (రాయచోటి జగదాంబ సెంటర్) : అప్పులబాధ తాళలేక రామాపురం మండలం రాచపల్లె పంచాయతీ వడ్డెపల్లికు చెందిన కుంచపు నాగేంద్ర(35) ఆత్మహత్య చేసుకున్నట్లు రామాపురం పోలీసులు తెలిపారు. కుంచపు నాగేంద్ర ఎక్కువగా అప్పులు చేశారు. ఈ నేపథ్యంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చెన్నారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి డిమాండ్ చేశారు. కడప పెన్షనర్ల భవనంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పెన్షనర్లు, ఉద్యోగులపై సవతి తల్లి ప్రేమ కనబరచడం విచారించదగిన విషయమన్నారు. కార్యదర్శి రామమూర్తినాయుడు మాట్లాడుతూ పెన్షనర్లకు రావాల్సిన 11వ పీఆర్సీ బకాయిలు, డీఆర్, ఈహెచ్‌ఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వాలు పెన్షనర్ల సమస్యలపై ఉదాసీనంగా ఉన్నందున అన్ని సంఘాలు కలిసి పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ జడపల్లి రాధాకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ రంగనాయకులు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి, కోశాధికారి నూనె నగేష్, నాయకులు తుపాకుల నారాయణ, చలపతి గౌడ్ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

వీరబల్లి (సుండుపల్లె) : అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుంచి 15 ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలలోకి వెళితే.. సానిపాయి అటవీ ప్రాంతంలో అప్పయ్యగారిపల్లి సమీపంలో తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు సుబ్బరాయుడు, ఆర్‌ఎస్‌ఐ లింగాధర్ టీం కూంబింగ్ చేపట్టింది. అక్కడ రెండు కార్లలో కొందరు ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని చుట్టుముట్టగా పారిపోవడానికి ప్రయత్నించారని పోలీసులు తెలిపారు. వారిని వెంబడించి 15 మంది నిందితులను పట్టుకుని తనిఖీ చేయగా 15 ఎర్రచందనం దుంగలు లభించాయని పేర్కొన్నారు. పట్టుబడిన వారు అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు చెందిన వారుగా గుర్తించామన్నారు. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఏసీఎఫ్ శ్రీనివాసులు విచారించినట్లు తెలిపారు. అనంతరం సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసు నమోదు

కలసపాడు : మండలంలోని మామిళ్లపల్లె గ్రామానికి చెందిన బత్తులచంద్రమోహన్, బత్తులఆదిలక్ష్మి, స్వర్ణ శ్రీనాథ్‌లపై పోలీసులు గురువారం అక్రమ కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మామిళ్లపల్లె గ్రామానికి చెందిన బత్తుల చంద్రమోహన్ పొలంలో టీడీపీ నాయకుడు ఇటీవల గ్రావెల్ రోడ్డు వేశాడు. 20 సంవత్సరాల నుంచి ఆ రోడ్డు ఎవరికి ఉపయోగంలో లేదు. ఇటీవల గ్రామ టీడీపీ నాయకుడు కక్ష సాధింపులో భాగంగా చంద్రమోహన్ పొలంలో అడ్డంగా రోడ్డు వేశాడు. అయినా చంద్రమోహన్ ఏమీ అనలేదు. ఐదు రోజుల క్రితం గ్రామంలోని ఓ ట్రాక్టర్‌తో చంద్రమోహన్ మిగిలిన భూమిని దున్నుకున్నాడు. రోడ్డును దున్నేశాడని టీడీపీ నాయకుడు బక్కిరెడ్డినారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు మామిళ్లపల్లె గ్రామానికి చెందిన చంద్రమోహన్, అతని భార్య ఆదిలక్ష్మి, ట్రాక్టర్ డ్రైవర్ శ్రీనాథ్‌లపై అక్రమంగా కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించారు.

డ్రైవర్‌పై అనుచిత వ్యాఖ్యలు

మామిళ్లపల్లె గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ స్వర్ణ శ్రీనాథ్‌పై ఎస్ఐ తిమోతి అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. నీపై రెండు, మూడు కేసులు ఉన్నాయని దుర్భాషలాడినట్లు బాధితుడు శ్రీనాథ్ తెలిపారు.

కువైట్‌లో ఆకుతోటపల్లి వాసి మృతి



మృతి చెందిన మురళి

అట్లూరు : మండలంలోని ఆకుటతోటపల్లి గ్రామానికి చెందిన సిద్ధవటం మురళి(40) కువైట్‌లో బిల్డింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ కిందపడి మృతిచెందినట్లు మృతుడి బంధువులు తెలిపారు. గోపిరెడ్డి, రమణమ్మల కుమారుడు మురళి పదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్లాడు. కువైట్‌లో బిల్డింగ్ పనులు చేసుకుంటూ సంపాదించిన దాంతో భార్య రేవతి, కొడుకు, కుమార్తెను, తల్లిదండ్రులను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం కువైట్‌లోని సబాహియా ప్రాంతంలో పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ కిందపడి అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిసింది. ఈ విషయం తెలిసిన కుటుంబ సభ్యులు విలపించారు. మృత దేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిసింది.

మార్చురీలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం



ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ఆస్పత్రిలోని మార్చురీలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం ఉంది. ఈ నెల 7న గుర్తు తెలియని వృద్ధుడు అనారోగ్యంతో జిల్లా ఆస్పత్రిలోని జీఈ వార్డులో చేరాడు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతదేహాన్ని ఆస్పత్రి సిబ్బంది మార్చురీలో భద్రపరిచారు. వృద్ధుడికి సంబంధించిన కుటుంబ సభ్యులు తగు ఆధారాలతో తమను సంప్రదించాలని ఔట్‌పోస్టు ఇంచార్జి షబ్బీర్‌బాషా తెలిపారు.

విష జ్వరంతో చిన్నారి మృతి

ఓబులవారిపల్లె : మండలంలోని వైకోట గ్రామానికి చెందిన అంకిపల్లి చందన (08) అనే చిన్నారి విష జ్వరంతో గురువారం సాయంత్రం మృతిచెందింది. బంధువుల కథనం మేరకు.. అంకిపల్లి విజయ్, రాజేశ్వరీ దంపతులకు ఒక్కగానొక్క కుమార్తె చందననుగారాబంగా పెంచుకున్నారు. బ్రతుకుదెరువుకోసం చిన్నారి తల్లిదండ్రులు గల్ఫ్ దేశానికి వెళ్లగా పెద్దనాన్న సుబ్రహ్మణ్యం వద్ద చందన ఉంటోంది. గురువారం పాఠశాలకు వెళ్లిన చందనకు రెండు సార్లు వాంతులు కావడంతో రైల్వేకోడూరు ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ 105 డిగ్రీల జ్వరం చూపించింది. తిరుపతికి తరలిస్తుండగా చిన్నారి మృతిచెందింది.